క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళాల అందజేత



విరాళం అందజేస్తున్న మండల జేసీఎస్ కన్వీనర్ సన్యాసిరావు

పరవాడ: నాయుడుపాలెం శివారు హనుమాన్ నగర్‌లో శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ నిర్మాణం కోసం మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు , లంకెలపాలెం వైఎస్సార్ సీపీ సుందరపు శ్రీనివాసరావు విరాళంగా రూ.5116 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఈ.లక్ష్మిప్రసాద్, ఎల్.అప్పలనాయుడు, ఎస్.సోమేశ్వరరావు, ఓ.అప్పారావు, అప్పలరాజు, కె.అప్పలనాయుడు, కె.చినసోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణ ఎంపికకు ఇంటర్వ్యూలు నేడు



ఎంపీడీవో హేమసుందర్రావు

పరవాడ: నర్సీపట్నంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్స్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో శుక్రవారం నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో వి.హేమసుందర్రావు చెప్పారు. ఎస్ఎస్‌సీ, డిప్లమో, డిగ్రీ ఆపై చదివిన నిరుద్యోగులు హాజరు కావచ్చునని ఆయన తెలిపారు. ఇంటర్వ్యూలు నర్సీపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉదయం 9 నుంచి ప్రారంభమవుతాయని ఎంపీడీవో హేమసుందర్రావు చెప్పారు. నిరుద్యోగులంతా హాజరు కావాలని సూచించారు.

మత్తు పదార్థాలతో జీవితాలు దుర్భరం



మాట్లాడుతున్న సీఐ రంగనాథం

సబ్బవరం: ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ రంగనాథం సూచించారు.మండలంలోని వంగలి గ్రామంలోశాంతి కమిటీ సభ్యులతో కలిసి డ్రగ్స్ నిర్మూలన, గంజాయి,మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. సీఐ రంగనాథం మాట్లాడుతూ మత్తుకు బానిసలైతే జీవితాలు దుర్భరంగా మారుతాయని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రిపుల్ రైడింగ్,హెల్మెట్ వాడకం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్ఐ వెంకటేశ్వరరావు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



సోరెన్ మృతదేహం

గోపాలపట్నం: కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం మృతి చెందాడు.దీనికి సంబంధించి ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 6న విమాన్‌నగర్‌లో సోరెన్ అనే వ్యక్తి ఎలక్ట్రికల్ పోల్ ఎక్కి పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. ఇది గుర్తించిన స్థానికులు, సచివాలయ మహిళా పోలీస్ ఆటోలో కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుని ఆధార్ కార్డులో ఉన్న వివరాలు ప్రకారం బీహార్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అయితే అతడి బంధువుల వివరాలు తెలియరాలేదు. మృతుడి వివరాలు తెలిసిన వారు ఉంటే ఎయిర్‌పోర్టు పోలీసులు సమాచారం ఇవ్వాలని కోరారు.

రేపు ఉపన్యాసం, క్విజ్ పోటీలు

బీచ్‌రోడ్డు: పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని యూత్ హాస్టల్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉమెన్ విభాగం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై శనివారం ఉపన్యాసం, క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి పి.కె.ఎం. లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 'ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కార మార్గాలు' అంశంపై మూడు నిమిషాల పాటు ఉపన్యాసం ఇవ్వవలసి ఉంటుందని పేర్కొన్నారు. అలాగే పర్యావరణం అంశంపై క్విజ్ పోటీలను నిర్వహిస్తామని తెలియజేశారు. బీచ్ రోడ్డులోని యూత్ హాస్టల్స్‌లో నిర్వహించే పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు 99490 24249 నంబరుకు ఫోన్ చేసి, పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నిరుపేద బాలికల జీవితాల్లో వెలుగు

- అనకాపల్లి ఎంపీ డాక్టర్ సత్యవతి



సాధికారత బాలికలతో ఎంపీ సత్యవతి, ఎన్టీపీసీ ఉన్నతాధికారులు

పరవాడ: నిరుపేద బాలికల జీవితాల్లో వెలుగులు నింపే దిశగా బాలిక సాధికారత మిషన్ వర్క్‌షాపు నిర్వహించిన సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యాన్ని ప్రత్యేకంగా అభినందిస్తున్నామని అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి అన్నారు. సింహాద్రి ఎన్టీపీసీలో మే 12న ప్రారంభమైన బాలిక సాధికారత మిషన్(జీమ్) వర్క్‌షాప్ గురువారంతో ముగిసింది. కార్యక్రమంలో ఎంపీ సత్యవతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికల్లో సృజనాత్మకత పెంపొందించడం, మానసిక, సామాజిక ఎదుగుదలకు ఈ వర్క్‌షాపు అనేక విధాలుగా దోహదపడుతుందన్నారు. వర్క్‌షాపును నిరుపేద బాలికలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సూచించారు. మూడేళ్ల నుంచి నిర్వహిస్తున్న బాలిక సాధికారత వర్క్‌షాప్ లక్ష్యాన్ని సింహాద్రి ఎన్టీపీసీ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా వివరించారు. వర్క్‌షాప్‌పై అంకితభావంతో పనిచేస్తున్నామని జీజీఎం సిన్హా వివరించారు. ముగింపు కార్యక్రమంలో భాగంగా దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో నాలుగు వారాల పాటు నిర్వహించిన బాలిక సాధికారత మిషన్ వర్క్‌షాపు వీడియోను ప్రదర్శించారు. బాలికలు నిర్వహించిన వివిధ ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ బి.రామారావు, ఓఅండ్ఎం జీఎం డి.పి.పాత్ర, రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, దీపిక లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా, హెచ్ఆర్ హెడ్ రుమాఢిశర్మ, బాలభారతి పాఠశాల విద్యార్థులు, సంస్థ అధికారులు పాల్గొన్నారు.



బాలికలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఎంపీ సత్యవతి, సంస్థ అధికారులు

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, అధికారులు, భక్తులు



నిత్యకల్యాణంలో అప్పన్నకు హారతి అందజేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణపుష్పార్చన ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అలంకరించి కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేశారు. 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అష్టోత్తర శతనామావళి నిర్వహించారు. పూజలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేష వస్త్రాలు, ప్రసాదం అందజేశారు.అర్చకులు పెదరాజు తదితరులు ఈ పూజ చేశారు. ఏఈవో నరసింహరాజు, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేసి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం,జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



విద్యార్థులతో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వెంకటరావు

సబ్బవరం: విద్యార్థులు గ్రంథాలయాలకు రావడం ద్వారా విజ్ఞానాన్ని వృద్ధి చేసుకోవచ్చని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు అన్నారు. సబ్బవరం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం గురువారం ఉత్సాహంగా సాగింది. శాఖా గ్రంథాలయాన్ని ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరంలో నేర్చుకున్న అంశాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు వేసిన డ్రాయింగ్, పెయింటింగ్‌లు చూసి వారి ప్రతిభను అభినందించారు. కార్యక్రమంలో సబ్బవరం గ్రంథాలయ అధికారి వి. శిరీషతో పాటు మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం



శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు, రాజేంద్రప్రసాద్

సింహాచలం: అడవివరం గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం గురువారం ఘనంగా జరిగింది. విద్యార్థులకు మాతృభాష విశిష్టతను సింహాచలం దేవస్థానం తెలుగు ఉపాధ్యాయురాలు వేణమ్మ వివరించారు. తెలుగుభాష విశిష్టతను పాటల ద్వారా అవగాహన కల్పించారు. రిసోర్స్ పర్సన్ బి.బి.రాజేంద్రప్రసాద్ విద్యార్థులకు ఆరోగ్య సూచనలు అందజేశారు. కథలు చదివించి అందులోని నీతిని తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఎన్.వి.నరసింహం, రిసోర్స్ పర్సన్లు చైతన్య, భాను తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయల సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు సందర్శించారు.

సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గుంటూరు మృతి



గుంటూరు రామారావు(ఫైల్)

సింహాచలం: పెందుర్తి మండలం సరిపల్లి మాజీ ఎంపీటీసీ సభ్యుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు గుంటూరు రామారావు(88) గురువారం సాయంత్రం మృతి చెందారు. కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో ద్రోణంరాజు సత్యనారాయణ, గుడివాడ అప్పన్న, ముమ్మన సూర్యనారాయణ, గుడివాడ గురునాథరావు, ఎస్ఆర్ఎస్ అప్పలనాయుడు వంటి నాయకులతో కలిసి రామారావు పనిచేశారు. సరిపల్లి అనుబంధ కాలనీలు రెల్లి కాలనీ, నీల కళాపురం కాలనీ ఏర్పాటుకు రామారావు చేసిన కృషి మరవలేనిది. రామారావు మృతి వార్త తెలుసుకుని సరిపల్లి తదితర గ్రామాల ప్రజలు తీవ్ర దుఃఖానికి గురయ్యారు. శుక్రవారం సరిపల్లిలో రామారావు అంత్యక్రియలు జరుగుతాయని మాజీ వ్యవసాయ కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుంటూరు నరసింహమూర్తి తెలిపారు.

కిడ్నీ పరిశోధనలకు అమెరికా స్కూల్ సహకారం



అమెరికాలో హెచ్ఎంఎస్ వైద్యులతో డాక్టర్ రవిరాజ్

- ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజ్

మహారాణిపేట : శ్రీకాకుళం జిల్లా ఉద్దానం కిడ్నీ వ్యాధులపై చేస్తున్న పరిశోధనలకు అమెరికాలోని హార్వర్డ్ మెడికల్ స్కూలు (హెచ్ఎంఎస్) సాంకేతిక సహకారం అందించేందుకు ముందుకు వచ్చిందని ప్రముఖ నెఫ్రాలజిస్టు, వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ విశ్రాంత ఉప కులపతి డాక్టర్ టి.రవిరాజ్ తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న డాక్టర్ రవిరాజ్ హార్వర్డ్ మెడికల్ స్కూలును సందర్శించారు. అక్కడి నెఫ్రాలజీ విభాగం ఆహ్వానం మేరకు అమెరికా వెళ్లిన ఆయన ఉద్దానం కిడ్నీ వ్యాధులపై పరిశోధనలు చేపట్టారు. తన పరిశోధనకు సహకారం అందించాలని డాక్టర్ రవిరాజ్ కోరారు. దీనికి హెచ్ఎంఎస్ నెఫ్రాలజీ విభాగం నుంచి సానుకూల సంకేతాలు అందాయి. ప్రభుత్వం అనుమతి ఇస్తే పలాసలో కొత్తగా నిర్మిస్తున్న కిడ్నీ ఆస్పత్రి, పరిశోధన కేంద్రంలో వారి సహకారం ఉపయోగించుకోవచ్చని డాక్టర్ రవిరాజ్ తెలిపారు. 1995 నుంచి 2000 మధ్యలో ఉద్దానం నుంచి కేజీహెచ్‌కు ఎక్కువ కిడ్నీ బాధితులు వచ్చే వారని ఆయన తెలిపారు. దీంతో ఉద్దానం వెళ్లి వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. తమ పరిశోధనలో అక్కడి ప్రజల్లో 18.5 శాతం మంది కిడ్నీ బాధితులు ఉన్నారని గుర్తించామన్నారు. సాధారణంగా షుగర్, బీపీ వంటి వ్యాధుల వల్ల కిడ్నీ సమస్యలు వస్తాయని, కాని ఉద్దానంలో అలాంటి సమస్యల వల్ల రాలేదన్నారు. నీరు, ఆహారం, మెటల్స్, భూమిని పరీక్షించామని, ఆయా పరీక్షల్లో కిడ్నీ జబ్బులు రావడానికి గల కారణాలు తెలియలేదన్నారు. ఈ నేపథ్యంలో హెచ్ఎంఎస్ సహకారంతో చేసే పరీక్షలతో పాటు జన్యు పరిశోధనలు కీలకం కానున్నాయన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ బులెటిన్‌లో ఉద్దానం కిడ్నీ వ్యాధులపై తాము చేసిన పరిశోధన పత్రం ప్రచురితమైందని చెప్పారు.

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలి



అధికారులతో బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

మహారాణిపేట : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరూ సహకరించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. కమిషన్ ఆదేశాలతో వారం రోజులుగా వివిధ ప్రభుత్వ శాఖల సమన్వయంతో జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ నిర్వహిస్తున్న చైల్డ్ లేబర్ డ్రైవ్‌ను గురువారం కలెక్టరేట్ ఆవరణలో సీతారాం పరిశీలించారు. ప్రత్యేక బస్‌లో వివిధ ప్రాంతాలకు వెళ్లనున్న వివిధ శాఖల అధికారులను ఇప్పటి వరకు నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీతారాం మాట్లాడుతూ బాలల బంగారు భవితకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో వేల కోట్లు ఖర్చు చేసి చక్కని విద్య, వసతి సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాయని అన్నారు. ఇటువంటి తరుణంలో బాలలను కార్మికులుగా మార్చి వారి జీవితాలను అగమ్యగోచరం కానీయొద్దని అన్నారు. అధికారులు పీటీవీ లోవకుమార్, సీహెచ్ శ్రీనివాస్, ఎస్.శిరీష, ఎ.ఆనంద్, లక్ష్మి, ప్రమీల, 1098 చైల్డ్‌లైన్ ప్రతినిధి మీనాకుమారి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పి.భాస్కరరావు, జ్యోతి, శ్రీదేవి, కె.ఎల్లయ్య, పి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

యువతికి రక్షణ



యువతిని జ్యోతిర్మయికి అప్పగిస్తున్న జీఆర్‌పీ పోలీసులు

అల్లిపురం: రోడ్డు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన ఒక యువతిని ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహంలో ఆశ్రయం కల్పించారు. గాజువాక ప్రాంతానికి చెందిన కె.కీర్తన తల్లిదండ్రులు రోడ్డు ప్రమాదంలో ఏడాది క్రితం మృతి చెందారు. సైకిల్ మీద వెళ్తున్న వారిని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే చనిపోయారు. అప్పటి నుంచి ఆమె అనాథలా రోడ్డుమీదే ఉంటుంది. ఐదు రోజుల క్రితం ఆమె రైల్వేస్టేషన్‌లో ఉండగా జీఆర్‌పీ పోలీసులు ఆమెను గమనించి ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందించడంతో ఆమెను షెల్టర్‌కు తీసుకువచ్చి ఆశ్రయం కల్పించారు. ఆమె డిగ్రీ చదువుకోవటంతో ఆమెకు ఉపాధి కల్పిస్తామని ఏయూటీడీ టీఎస్ఆర్ కాంప్లెక్స్ మేనేజర్ జ్యోతిర్మయి తెలిపారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు

అగనంపూడి: ఇటీవల ఒడిశాలో చోటుచేసుకున్న ఘోర రైలు ప్రమాద ఘటనలో మృతి చెందిన వారికి అగనంపూడి అఖిలపక్ష నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. తొలుత మినీ జగదాంబ జంక్షన్ నుంచి అగనంపూడి జంక్షన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ ప్రమాదంపై జ్యుడీషియల్ విచారణ నిర్వహించాలని, మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు తగిన నష్ట పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైల్వే సీసీ సభ్యుడు కొలిపాక అప్పారావు, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, కడిమి హనుమంతరావు, దొడ్డి దేముడు, బలిరెడ్డి శ్రీను, గుదే సుశీల గజేంద్ర, స్థానిక యువకులు పాల్గొన్నారు.

దశ మహావిద్యలపై ముగిసిన ప్రవచనాలు

సీతంపేట: లలితానగర్ లలితా పీఠంలో ఈ నెల 4 నుంచి జరుగుతున్న దశ మహావిద్యల ప్రవచనాల కార్యక్రమం గురువారంతో ముగిసింది. కుర్తాళం శంకరాచార్య, లలితా పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి చివరి రోజు ప్రవచనంలో భాగంగా తారా దేవి వృత్తాంతం గురించి ప్రవచించారు. ఉత్తర ఈశాన్య భారత ప్రాంతాల్లో కాళీ పూజలతోపాటు తారాదేవి ఆరాధన ఉంటుందని తెలిపారు. ఎంతో సాధన చేస్తే తప్ప దేవీ సాక్షాత్కారం లభించదని, రామకృష్ణ పరమహంస వంటి వారు విశేష సాధన వల్లే కాళీ దర్శనం పొందగలిగారన్నారు. తారా మంత్రం మహిళల ద్వారా పొందడం సంప్రదాయమని పేర్కొన్నారు. తారా మంత్రోపాసన గురించి అనేక విషయాలను ఆసక్తికరంగా ఉపదేశించారు. సాహితీవేత్తలు స్వామి వారి ప్రవచనాలు శ్రద్ధగా విన్నారు. లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శుక్రవారం నుంచి ఈ నెల 11 వరకు శక్తి పీఠాధీశ్వరి రమ్యానందభారతీ స్వామిని శ్రీ వారాహి వైభవంపై ప్రవచిస్తారని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ ఆలోచనలకు కార్మికుల జీవితాలు బలి



847వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం కుటిల రాజకీయంతో చేస్తున్న దుర్మార్గపు ఆలోచనలకు కార్మికుల జీవితాలు బలవుతున్నాయని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ ప్రధాని మోదీ తన నిరంకుశత్వ పాలనతో స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 847వ రోజు, గురువారం స్టీల్‌ప్లాంట్‌లోని ఆర్ఎంహెచ్‌పీ, ఏసీఎస్, హెచ్ఆర్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రకటన చేయాలని, లేని పక్షంలో బీజేపీకి వచ్చే ఎన్నికల్లో డిపాజిట్లు కూడా దక్కవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న వేద పండితులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు నెల్లిముక్కులోని సీతారామాలయంలో ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా గురువారం వేద పండితుల ఆధ్వర్యంలో 21 మంది దంపతులతో స్వామి ఆలయంలో మాలధారణ చేశారు. అలాగే విష్వక్సేన పూజ, హోమ ప్రతిష్ఠ, వినాయక పూజ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు గొందేశి మహేశ్వరరెడ్డి, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, సత్యారావు, ఎల్లేటి శ్రీనివాసరావు, పిట్ట రమణ, దేవాడ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పిస్తోల్ కేసులో చురుగ్గా విచారణ

సీతమ్మధార : మహారాష్ట్ర నుంచి పిస్తోల్‌ను ఒడిశాకు తరలిస్తున్న శ్రీధర్ వారికిషన్ పతాంగిని ఫోర్తుటౌన్ పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించారు. అలాగే పిస్తోల్ ఇచ్చి పంపించిన మహారాష్ట్రలోని జలానా జిల్లాకు చెందిన దత్తపవర్‌ని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరినీ ఒకే చోట ఉంచి గురువారం విచారణ చేపట్టారు. అసలు పిస్తోల్ ఎవరు ఇచ్చారు..?, ఎక్కడి నుంచి వచ్చింది..? అన్న కోణంలో ఆరా తీశారు. అయితే ఈ ఇద్దరూ చెప్పిన మాటలకు పొంతన లేకపోవడంతో దత్త పవర్‌ని ప్రత్యేకంగా విచారించారు. సందీప్ అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేసినట్లు దత్త పవర్ పోలీసుల విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. ఈ కేసులో రోజుకో కొత్త పేరు వెలుగులోకి రావడం పోలీసులకు తలనొప్పిగా మారింది. గతంలో ఆత్మరక్షణ కోసమని చెప్పి... ప్రస్తుతం సందీప్ నుంచి కొనుగోలు చేసినట్లు చెప్పడంతో ఆ వ్యక్తిపై పోలీసులు దృష్టి సారించారు. అసలు పిస్తోళ్లు ఎవరు సరఫరా చేస్తున్నారు అన్న కోణంలో ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు.

మేధోహక్కుల పరిరక్షణలో కాపీరైట్స్ కీలకం



సదస్సులో ప్రసంగిస్తున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్, డాక్టర్ బి.ఆర్ .అంబేడ్కర్ న్యాయ కళాశాల, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ సంయుక్తంగా ' ఏఐ జెనరేటెడ్ వర్క్స్– ఆథర్‌షిప్ అండ్ ఓనర్‌షిప్ అండ్ ద కాపీరైట్ యాక్ట్, 1957 అంశంపై ఒకరోజు జాతీయ వెబినార్ నిర్వహించింది. సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన ఏయూ రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ రచయితలు, కళాకారులు, డిజైనర్లు, కంపోజర్లు, ఇతర సృజనాత్మక వ్యక్తుల కాలాన్ని, మేధస్సును పరిరక్షించే దిశగా ప్రత్యేక హక్కులు అవసరాన్ని తెలియజేశారు. ఏఐ, చాట్ జీపీజీ, చాట్ బోట్ వంటి నూతన సాంకేతికతల ఆవిర్భావంతో ఎదురయ్యే కాపీరైట్ చట్టాలు అవసరం, నూతన సవాళ్లను వివరించారు. అనంతరం భారత ప్రభుత్వ రిజిస్ట్రార్స్ ఆఫ్ కాపీరైట్ పూర్వ జాయింట్ సెక్రటరీ డాక్టర్ జి.ఆర్. రాఘవేంద్ర మాట్లాడుతూ నూతనంగా ఏఐ సాంకేతికత ఆవిర్భావంతో ఎదురయ్యే సవాళ్లు, చట్టపరమైన అంశాలను విపులీకరించారు.

డీపీఐఐటీ–ఐపీఆర్ చెయిర్ ప్రొఫెసర్ డాక్టర్ హనుమంతు పురుషోత్తం మాట్లాడుతూ సదస్సుకు 18 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 862 మంది విద్యార్థులు, అధ్యాపకులు, న్యాయవాదులు, ఐపీ నిపుణులు హాజరయ్యారని తెలిపారు. కాపీరైట్ చట్టం, ఏఐ జనరేటెడ్ వర్క్స్ తదితర అంశాలు మానవ జీవితంపై ఎటువంటి ప్రభావాన్ని చూపుతాయి అనే అంశంపై ప్రసంగించారు. డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా జ్ఞానాన్ని సృష్టించిన వారికి, ఆవిష్కరణలు చేసిన వారికి కొన్ని ప్రత్యేకమైన చట్టాలు ఉండాల్సిన అవసరాన్ని వివరించారు. మేధో హక్కుల పరిరక్షణలో కాపీరైట్ చట్టం ఉపయోగాన్ని తెలియజేశారు.

నోడల్ ఏజెన్సీ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

ఏయూక్యాంపస్: విభిన్న ప్రతిభావంతులకు ఉపయుక్తంగా పునరావాస కేంద్రం ఏర్పాటుకు అవసరమైన నోడల్ ఏజెన్సీ స్థాపనకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా భారత ప్రభుత్వ సామాజిక న్యాయ, సాధికారత మంత్రిత్వ శాఖ సూచనలతో విభిన్న ప్రతిభావంతులకు వివిధ రకాల సేవలు అందించే విధంగా ఈ కేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. దివ్యాంగుల కోసం పనిచేస్తున్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ప్రభుత్వ, ప్రభుత్వయేతర స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థలు ఈ నెల 17వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు అందించాలని సూచించారు. వివరాలకు www.socialjustice.gov.in వెబ్‌సైట్‌లో గాని పెదవాల్తేరులోని రాణి చంద్రమణి దేవి ఆసుపత్రి ఆవరణలో ఉన్న సహాయ సంచాలకుల కార్యాలయంలో గాని, 0891–2952585 ఫోన్ నంబర్‌లో గాని సంప్రదించవచ్చన్నారు.

జాతీయ స్థాయి సదస్సు రేపు

డాబాగార్డెన్స్: శివానంద సుపథ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విశాఖలో భారతీయతలో–అమృతకాలం అనే అంశంపై ఈ నెల 10, 11 తేదీల్లో జాతీయ స్థాయి సదస్సు నిర్వహించనున్నట్టు ప్రోగ్రామ్ కన్వీనర్ ఎస్.రాధాకుమారి తెలిపారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్స్ డాక్టర్ వైఎస్ మూర్తి ఆడిటోరియం వేదికగా జరగనున్న సదస్సుకు వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, ఆచార్యులు పాల్గొని జ్యోతిష్యం, ఆరాధ్య వ్యవస్థ, ఆలయ వ్యవస్థ, రక్షణ వ్యవస్థ, శిక్షణ వ్యవస్థ, ఆధ్యాత్మికత–భారతీయత, అర్థ వ్యవస్థ ఇలా అనేక అంశాలపై ప్రసంగిస్తారన్నారు. విశాఖలో తొలిసారిగా మానవాళి మనుగడకై వివిధ అంశాలపై నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సదస్సుకు నగర వాసులు విచ్చేయాలని కోరారు.